సాక్షి
విశాఖపట్నం
మంగళవారం । 29 । ఏప్రిల్ । 2025

పోలీస్ ఎస్కార్ట్ ఇవ్వండి!

- కొత్త మేయర్ కొంగొత్త కోరికలు
- అనవాయితీ లేదన్న కార్పొరేషన్ అధికారులు
- పోలీస్ కమిషనర్‌తో మాట్లాడుకోవాలని సూచన



సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం :

గ్రేటర్ విశాఖపట్నం మునిసిపల్ కార్పొరేషన్ మేయర్ పీఠంపై కూర్చున్న తొలి రోజే.. కొత్త మేయర్ పీలా శ్రీనివాసరావు కొంగొత్త కోరికల చిట్టా తెరమీదకు వచ్చినట్టు తెలుస్తోంది. తనకు నగర ప్రథమ పౌరుడి హోదాలో 2 ప్లస్ 2 గన్‌మెన్లను కేటాయించాలని జీవీఎంసీ ఉన్నతాధికారులను అడిగినట్టు సమాచారం. అయితే జీవీఎంసీ కౌన్సిల్ బుక్‌ను అమాంతం తిరగేసిన అధికారులు కాస్తా... అటువంటి సౌకర్యం లేదని తేల్చిచెప్పినట్టు తెలుస్తోంది. ఒకవేళ ఏదైనా ప్రాణాపాయం ఉంటే నేరుగా పోలీస్ కమిషనర్‌కు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేసినట్టు సమాచారం. అయితే ఇందుకయ్యే వ్యయాన్ని కూడా జీవీఎంసీ నిధుల నుంచి ఇవ్వలేమని కూడా కుండబద్దలు కొట్టినట్టు విశ్వసనీయవర్గాలు తెలిపాయి. ఈ నేపథ్యంలో తన కోరికను నెరవేర్చుకునేందుకు ఎటువంటి ప్రయత్నాలు చేస్తారనేది చూడాల్సి ఉంది.

కూటమి గెలిచినప్పటి నుంచీ..!

వాస్తవానికి సాధారణ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి కాబోయే మేయర్ తానేనంటూ పీలా శ్రీనివాసరావు ప్రచారం చేసుకున్నారు. అనధికారికంగా అధికారులతో సమావేశాలు కూడా ఏర్పాటు చేశారు. స్టాండింగ్ కమిటీలతో సంబంధం లేకపోయినప్పటికీ సమావేశంలో ఏయే అంశాలను అంగీకరించాలి? వేటిని వ్యతిరేకించాలనే విషయంలోనూ జోక్యం చేసుకున్నారనే ఆరోపణలున్నాయి. ఈ విషయంలో స్టాండింగ్ కమిటీ సభ్యులే పార్టీలోని పెద్దలకు ఫిర్యాదు కూడా చేసినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో అమరావతి నుంచి పిలుపురావడం.. క్లాస్ పీకడం కూడా జరిగిందని సొంత పార్టీ నేతలే అప్పట్లో పేర్కొన్నారు. అయినప్పటికీ పెద్దగా మార్పురాలేదని, ఆయన తరువున మరో ఇద్దరు వ్యక్తులు మొత్తం వ్యవహారాల్లో చక్రం తిప్పుతున్నారని సొంత పార్టీ కార్పొరేటర్లే విమర్శలు గుప్పిస్తున్నారు. అన్ని కాంట్రాక్టు వ్యవహారాలతో పాటు ప్రాజెక్టుల విషయంలోనూ ఇద్దరు శ్రీనులు జోక్యం చేసుకుంటూ కలెక్షన్ కింగులుగా మారారనే ఆరోపలున్నాయి. ఇప్పుడు ఏకంగా మేయర్ పీఠంపై కూర్చోవడంతో తమకు ఎదురులేదనే రీతిలో వ్యవహరించే ప్రమాదం ఉందని కూటమి నేతలే అంతర్గత సంభాషణల్లో వ్యాఖ్యానిస్తున్నారు.

అంతా ఆ ఇద్దరి హవానే...!

సాధారణ ఎన్నికల్లో కూటమి అధికారంలోకి రాగానే... మేయర్ పీఠాన్ని అధిష్టించాలని తన కోరికను ఆయన అధిష్టానం ముందు ఉంచారు. అయితే, నిబంధనల మేరకు నాలుగేళ్ల వరకూ అవిశ్వాసం పెట్టేందుకు అవకాశం లేకపోవడంతో మిన్నకుండిపోయారు. నాలుగేళ్ల కాలపరిమితి ముగిసిన వెంటనే తన ప్రయత్నాలను ముమ్మరం చేశారు. ఈ వ్యవహారాల్లో ఆయన అనుచరులుగా ఉన్న ఇద్దరు శ్రీనుల ప్రమేయం ప్రధానంగా ఉందని తెలుస్తోంది. మేయర్‌గా పీలా శ్రీనివాసరావు కుర్చీలో కూర్చున్నప్పటికీ... వ్యవహారాలన్నీ ఆ ఇద్దరు శ్రీనులే నడిపించనున్నారు. ఇప్పటికే అనేక వార్డుల్లో తమను పక్కన పెట్టి... వీరి పెత్తనం ఏమిటంటూ సొంత పార్టీ కార్పొరేటర్లే మండిపడుతున్నారు. ఇద్దరు శ్రీనుల వ్యవహారాలను పార్టీ ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జి మంత్రి నేరుగా లోకేష్ దృష్టికి కూడా తీసుకెళ్లినట్టు సమాచారం. అయినప్పటికీ వారి వైఖరిలో ఎలాంటి మార్పులేకపోగా... తాజాగా మరింత దూకుడు పెరిగినట్టు తెలుస్తోంది. కొద్దిరోజుల క్రితం ఇద్దరు శ్రీనుల్లో ఒక శ్రీను ఫోన్ చేయగా... ఒక అధికారి ఫోన్ ఎత్తలేదని ఆయనను బదిలీ చేయాల్సిందేనంటూ పట్టుబట్టినట్టు సమాచారం. తనకు ఆయన ఫోన్ నెంబరు తెలియకపోవడంతో బదులివ్వలేదని సదరు అధికారి బతిమలాడుకోవాల్సి వచ్చిందని జీవీఎంసీలో చర్చనీయాంశమైంది. ఇప్పుడు ఇక ఏకంగా మేయర్ పీఠంపై తమ నేత కూర్చోవడంతో ఆ ఇద్దరు శ్రీనులను కట్టడి చేయడం సాధ్యం కాదనే వాదన వినిపిస్తోంది. రానున్న రోజుల్లో ఇంకా ఎలాంటి పరిణామాలను జీవీఎంసీలో చూడాల్సి వస్తుందోననే ఆందోళన కూటమి నేతల్లోనే వ్యక్తమవుతోంది.

మేయర్‌గా పీలా ఏకగ్రీవం



మేయర్‌గా ప్రమాణ స్వీకారం చేసిన పీలా శ్రీనివాస్‌ను అభినందిస్తున్న నగర ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ

డాబాగార్డెన్స్ : జీవీఎంసీ మేయర్‌గా కూటమి కార్పొరేటర్ పీలా శ్రీనివాస్‌ను కూటమి కార్పొరేటర్లు, ఎక్స్ అఫీషియో సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన మేయర్ ఎన్నికకు జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ ఎన్నికల ప్రిసైడింగ్ అధికారిగా వ్యవహరించారు. పీలా శ్రీనివాస్ అభ్యర్థిత్వాన్ని జనసేన ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు ప్రతిపాదించారు. పీలా శ్రీనివాస్ ఎన్నికైనట్టు ఎన్నికల అధికారి ప్రకటించి నియామక పత్రం అందజేశారు. అనంతరం పలువురు అధికారులు పీలాచే ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, కార్పొరేటర్లు పీలాను అభినందించారు.

నిస్వార్థంగా పనిచేస్తా..

మేయర్‌గా ప్రమాణ స్వీకారం చేసిన పీలా శ్రీనివాస్ మీడియాతో మాట్లాడుతూ మంచి నాయకత్వం నడుపుతానని, నాయకత్వానికి విలువ చూపుతానన్నారు. నిస్వార్థంగా విశాఖ ప్రజలకు సేవలందిస్తానన్నారు.

అంతా పావు గంటలోనే..


ఉదయం 10.55 గంటలకు సభ్యులందరూ(కార్పొరేటర్లు, ఎక్స్ అఫీషియో సభ్యులు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ) సభలో ఆశీనులయ్యారు. 11 గంటలకు ఎన్నికల అధికారి మయూర్ అశోక్ సమావేశ మందిరానికి చేరుకున్నారు. 5 నిమిషాల్లో ఎన్నికకు సంబంధించి నియమ నిబంధనలు సూచించారు. మరో 5 నిమిషాల్లో మేయర్ ఎన్నిక తంతు పూర్తి చేశారు.

గ్రేటర్ 3వ మేయర్‌గా..

విశాఖ మున్సిపల్ కార్పొరేషన్‌కు 7వ మేయర్‌గా, గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్‌కు 3వ మేయర్‌గా పీలా శ్రీనివాస్ ఎన్నికయ్యారు. విశాఖ తొలి మేయర్‌గా ఎన్ఎస్ఎన్ రెడ్డి, రెండో మేయర్‌గా డి.వి.సుబ్బారావు, మూడో మేయర్‌గా సబ్బం హరి, నాల్గో మేయర్‌గా రాజాన రమణి కొనసాగగా, గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్‌గా అవతరించిన తర్వాత పులుసు జనార్దనరావు తొలి మేయర్‌గా, రెండో మేయర్‌గా గొలగాని హరి వెంకటకుమారి కొనసాగారు. మూడో మేయర్‌గా పీలా శ్రీనివాస్ ఇప్పుడు ఎన్నికయ్యారు.

రెచ్చిపోయిన టీడీపీ గ్యాంగ్

మేయర్‌గా పీలా శ్రీనివాస్ ప్రమాణ స్వీకారం చేసిన కొద్ది నిమిషాలకే టీడీపీ తమ్ముళ్లు రెచ్చిపోయారు. వాహన చోదకులను ఇబ్బందులకు గురి చేశారు. ట్రాఫిక్ నియంత్రిస్తున్న ట్రాఫిక్ పోలీసులపై రెచ్చిపోయారు. వీరంగం సృష్టించారు. పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ఒకింత విసిగించారు. సంబరాలు చేసుకోవచ్చు.. కానీ పౌరులను ఇబ్బంది పెట్టి చేసుకోవడం సమంజసం కాదని పలువురు నగర పౌరులు బాహాటంగానే చెప్పుకున్నారు. ఇదిలా ఉండగా.. జీవీఎంసీ గాంధీ పార్కు నుంచి జీవీఎంసీ ప్రధాన ద్వారానికి వచ్చే మార్గాన్ని ట్రాఫిక్ పోలీసులు క్లోజ్ చేశారు. టీడీపీకి చెందిన కాళ్ల శంకర్ నువ్వు ఎవరంటూ అక్కడున్న మహిళా ట్రాఫిక్ పోలీసుపై చిందులేశారు. నువ్వు నన్ను ఆపుతావా.. అంటూ కారును స్పీడ్‌గా దూసుకుపోవడంపై పలువురు మండిపడ్డారు.





సింహగిరిపై ఏర్పాటు చేసిన దర్శన క్యూలు

రేపే అప్పన్న చందనోత్సవం



ఉచితంగా అందజేయనున్న చిన్న లడ్డూలు

- తెల్లవారుజామున 3.30 గంటల నుంచి సర్వదర్శనం ప్రారంభం
- సాయంత్రం 6 గంటల తర్వాత సింహగిరిపైకి అనుమతి లేదు
- రాత్రి 7 గంటలకు సింహగిరిపై క్యూల ప్రవేశ గేట్లు మూసివేత
- ప్రోటోకాల్ వీఐపీలకు ఉదయం 6 గంటలతో అంతరాలయ దర్శనాలు పూర్తి
- ఆ తర్వాత అందరికీ నీలాద్రిగుమ్మం నుంచే లఘు దర్శనం
- 2 లక్షల మంది భక్తులు వస్తారని అంచనా

సింహాచలం : వరాహ, నారసింహ రూపాలను ఒక్కటిగా చేసుకుని సంవత్సరమంతా చందనం మణుగుల్లో నిత్యరూపంలో దర్శనమిచ్చే సింహాద్రి నాథుడి నిజరూప దర్శనం లభించే సమయం ఆసన్నమైంది. సింహగిరిపై కొలువైన శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి చందనోత్సవం బుధవారం జరగనుంది. ఏడాదిలో కేవలం ఒక్క రోజులోని కొన్ని గంటలు మాత్రమే లభించే ఈ అరుదైన దర్శనాన్ని చేసుకునేందుకు భక్తులు తరలిరానున్నారు. ఈసారి 2 లక్షల మంది భక్తులు స్వామి నిజరూప దర్శనం చేసుకుంటారని అంచనా వేశారు. సాధారణ భక్తులకు పెద్ద పీట వేస్తూ.. వారికి దర్శనాల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా రాష్ట్ర మంత్రుల కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్ హరేందిర ప్రసాద్, సింహాచలం దేవస్థానం ఈవో కె.సుబ్బారావు నేతృత్వంలో జిల్లా యంత్రాంగం భారీ ఏర్పాట్లు చేసింది.

వెండిబొరుగులతో చందనం ఒలుపు

చందనోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం తెల్లవారుజామున ఒంటి గంట నుంచి పాంచరాత్ర ఆగమశాస్త్రం ప్రకారం ఆలయ అర్చకులు వైదిక కార్యక్రమాలు ప్రారంభిస్తారు. సుప్రభాతసేవ, విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, రుత్విగ్వరణం, కలశారాధన చేస్తారు. అనంతరం వెండిబొరుగులతో స్వామిపై ఉన్న చందనాన్ని తీసి నిజరూపభరితుడిని చేస్తారు. తెల్లవారుజామున 3 గంటలకు దేవస్థానం అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజుకి తొలిదర్శనం కల్పిస్తారు. 3.30 గంటల నుంచి రాష్ట్ర ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు సమర్పించే రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్, టీటీడీ తరపున పట్టువస్త్రాలు సమర్పించేవారికి, ఇతర ప్రముఖులకు దర్శనం కల్పిస్తారు. ఉదయం 6 గంటలతో అంతరాలయ దర్శనాలు పూర్తిచేస్తారు.

ఉదయం 3.30 గంటల నుంచి సర్వదర్శనం

ఉదయం 3.30 గంటల నుంచి సర్వదర్శనాలు ప్రారంభిస్తారు. ఉచిత దర్శనం, రూ.300, రూ.1000 టికెట్లు క్యూల్లో ఉన్న వారందరికీ దర్శనాలు ప్రారంభిస్తారు. సాయంత్రం 6 గంటలలోపే సింహగిరిపై దర్శనాల క్యూల్లోకి భక్తులను అనుమతిస్తారు. రాత్రి 7 గంటలకు క్యూల ప్రవేశ ద్వారాలు మూసివేసి అప్పటి వరకు క్యూల్లో ఉన్న భక్తులకు స్వామి దర్శనం కల్పిస్తారు. సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే సింహగిరిపైకి బస్సుల్లో భక్తులను అనుమతిస్తారు. ఆ తర్వాత ఖాళీ బస్సులను కొండపైకి పంపించి కొండపై ఉన్న భక్తులను కొండదిగువకి చేరుస్తారు. 29వ తేదీ మంగళవారం సాయంత్రం 6 గంటల తర్వాత కూడా భక్తులను కొండపైకి అనుమతించరు.

భక్తులతో మర్యాదగా మెలగండి

చందనోత్సవంలో విధులు నిర్వర్తించే పోలీసులు సామాన్య భక్తులతో మర్యాద కలిగి, అప్రమత్తంగా ఉండాలని పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి సూచించారు. సోమవారం సింహాచలంలో ఆయన పోలీసులకు పలు సూచనలు చేశారు. క్యూల వద్ద దేవస్థానం అధికారులు సూచించిన విధంగా నడుచుకోవాలన్నారు. రాంగ్ పార్కింగ్ వాహనాలను టోయింగ్ చేసి తరలించాలని సూచించారు. డ్రోన్ సాంకేతికతను పూర్తిగా వినియోగిస్తామన్నారు.

సామాన్య భక్తులకే పెద్దపీట



మాట్లాడుతున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

బీచ్‌రోడ్డు: చందనోత్సవంలో సాధారణ భక్తుల దర్శనానికి తొలి ప్రాధాన్యమివ్వాలని కలెక్టర్ హరేందిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. చందనోత్సవ ఏర్పాట్లపై కలెక్టరేట్‌లో ఆయన జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. కొండ పైన, కింద నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలని, పూర్తి ఫిట్‌నెస్‌తో ఉన్న ఆర్టీసీ బస్సులను మాత్రమే నడపాలని ఆదేశించారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా విక్రయించే టికెట్లపై సీరియల్ నంబర్, స్కానింగ్, క్యూలను సూచించే బోర్డులను స్పష్టంగా ఏర్పాటు చేయాలని సూచించారు. సింహాచలం ప్రాంతంలోని మద్యం షాపులను మంగళవారం సాయంత్రం 6 గంటల నుంచి గురువారం ఉదయం 6 గంటల వరకు మూసివేయాలని అధికారులను ఆదేశించారు.

ఏర్పాట్లు ఇలా...

- అడవివరం సమీపంలోని రెండో ఘాట్‌రోడ్డు నుంచే బస్సులు సింహగిరికి వెళ్లేలా.. తొలి ఘాట్‌రోడ్డులో బస్సులు కిందకు దిగేలా ప్రణాళికలు సిద్ధం చేశారు.
- 30వ తేదీ తెల్లవారుజాము 3 గంటల నుంచి పాత గోశాల జంక్షన్, పాత అడవివరం జంక్షన్‌ల నుంచి దేవస్థానం ఏర్పాటు చేసిన బస్సుల్లో మాత్రమే సింహగిరిపైకి భక్తులను అనుమతిస్తారు. దేవస్థానం అద్దె చెల్లించిన 51 ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా భక్తులకు రవాణా సదుపాయం ఏర్పాటు చేశారు. ఉచిత దర్శనం, రూ.300 టికెట్ల వారికి ఆర్టీసీ బస్సులు, రూ.1000, రూ.1500 టికెట్ల వారికి మినీ బస్సులు సిద్ధం చేశారు.
- తొలిసారిగా ఉచిత లడ్డూ ప్రసాదం అందిస్తున్నారు. ఈమేరకు 1.7 లక్షల చిన్న లడ్డూలను సిద్ధం చేస్తున్నారు.
- కొండదిగువ పాత గోశాల జంక్షన్, పాత అడవివరం జంక్షన్, శ్రీనివాసనగర్‌లో లడ్డూ ప్రసాదం విక్రయిస్తారు. ఈ మేరకు 60 వేల లడ్డూలను సిద్ధం చేశారు.
- దివ్యాంగులకు సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు ప్రత్యేక దర్శన సమయం కేటాయించారు. దివ్యాంగుడితో ఒకరిని సహాయకుడిగా అనుమతిస్తారు.
- ఒకేసారి 25,300 మంది భక్తులు వేచి ఉండేలా సింహగిరిపై 37,950 వేల రన్నింగ్ ఫీట్ మేర దర్శనాల క్యూలను రూపొందించారు.
- ప్రస్తుతం ఉన్న 106 పర్మినెంట్ మరుగుదొడ్లతో పాటు అదనంగా 133 తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు.
- స్వచ్ఛంద సంస్థలు తాగునీరు, మజ్జిగ, శీతల పానీయాలు, అల్పాహారాలు, స్నాక్స్ అందించనున్నాయి.
- దర్శనాంతరం సింహగిరిపై అన్నదాన భవనం వద్ద 60 వేల మందికి దద్దోజనం, కదంబం అన్నప్రసాదంగా అందించనున్నారు.
- కేశఖండనశాలకు కేవలం సింహగిరిపై లోవతోట ప్రాంతం నుంచి మాత్రమే వెళ్లేలా ఏర్పాటు చేశారు.
- కొండపైన 8, కొండ దిగువన 7 వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నారు. ఈనెల 29, 30 తేదీల్లో 513 మంది వైద్య సిబ్బంది నాలుగు షిఫ్టుల్లో పనిచేస్తారు. 32 అంబులెన్సులు, 10 స్ట్రెచర్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ప్రథమ చికిత్స కిట్లు, వైద్యులు అందుబాటులో ఉంటారు.
- సీపీ శంఖబ్రత బాగ్చి ఆధ్వర్యంలో 2 వేల మంది పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు.
- రాత్రి 9 గంటల నుంచి సహస్ర ఘటాభిషేకం నిర్వహిస్తారు. ఇందుకోసం ఉత్తర, దక్షిణ రాజగోపురాల వద్ద ప్రత్యేకంగా బ్రిడ్జిలు ఏర్పాటుచేశారు.
- నిఘా కోసం 206 సీసీ కెమెరాలు ఏర్పాటుచేశారు.
- చందనోత్సవంకి సంబంధించిన సమాచారం 0891-275666 నెంబర్‌లో తెలుసుకోవచ్చు.
- డ్యూటీ పాస్ ఉన్న వెహికల్స్‌ని మాత్రమే పరిమితంగా సింహగిరిపైకి అనుమతిస్తారు.

డీసీసీబీ చైర్మన్‌గా కోన తాతారావు



కోన తాతారావు

పెదగంట్యాడ: విశాఖపట్నం జిల్లా సహకార బ్యాంక్ చైర్మన్‌గా కోన తాతారావును నియమించారు. మండలంలోని ముసలివానిపాలేనికి చెందిన కోన తాతారావు తెలుగుదేశం పార్టీలో చేరి రాజకీయ జీవితం ప్రారంభించారు. కార్పొరేటర్‌గా పని చేశారు. అనంతరం జనసేన పార్టీలో చేరారు. పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవారు. ఆయన నియామకం పట్ల పార్టీ నేతలు హర్షం వ్యక్తం చేశారు.

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తులు

కంచరపాలెం : జిల్లాలోని వివిధ ప్రభుత్వ/ప్రైవేటు పారిశ్రామిక శిక్షణ కేంద్రాల్లో(ఐటీఐ) ప్రవేశాలకు మే 24లోగా iti.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ జె.శ్రీకాంత్ తెలిపారు. జిల్లాలో అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలకు ఒక దరఖాస్తు సరిపోతుందన్నారు. స్టీల్‌ప్లాంట్ ఆర్ కార్డుకు సంబంధించిన అభ్యర్థులు ప్రత్యేక కేటగిరిలో దరఖాస్తు చేసుకుని విధిగా వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. ప్రభుత్వ ఐటీఐ(ఓల్డ్) కంచరపాలెం, ప్రభుత్వ ఐటీఐ(బాలికలు) ఇండస్ట్రియల్ ఎస్టేట్, ప్రభుత్వ ఐటీఐ(కొత్తది) గాజువాక, ప్రభుత్వ ఐటీఐ నరవలో వెరిఫికేషన్ చేయించుకోవాలని తెలిపారు.

రాయితీ రుణాల దరఖాస్తు గడువు మే 10

ఎంవీపీకాలనీ: ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి అందిస్తున్న రాయితీ రుణాల దరఖాస్తు గడువు మే 10వ తేదీతో ముగియనుంది. ఈ మేరకు అర్హులైన వారంతా దరఖాస్తు చేసుకోవాలని కార్పొరేషన్ ఓ ప్రకటనలో సూచించింది. జిల్లాకు 406 యూనిట్లను ప్రభుత్వం కేటాయించింది. రూ.16.88 కోట్లతో 32 రకాల రుణాలను లబ్ధిదారులకు అందించనున్నారు. అర్హులైన వారు మే 10వ తేదీలోగా https://apobmms.apcfss.in ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. 21 నుంచి 50 ఏళ్లలోపు ఉన్న వారు ఈ రుణాలకు అర్హులు. ఆధార్ కార్డ్, తెలుపు రేషన్ కార్డ్, పాన్ కార్డ్, కుల ధ్రువీకరణ పత్రాలను దరఖాస్తుతో పాటు అందజేయాల్సి ఉంటుంది.

కేజీహెచ్‌లో విజయవంతంగా కిడ్నీ మార్పిడి



కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్స విజయవంతం చేసిన వైద్య బృందాన్ని అభినందిస్తున్న సూపరింటెండెంట్ శివానంద్

దాబాగార్డెన్స్: కేజీహెచ్‌లో 16 ఏళ్ల బాలుడికి విజయవంతంగా కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్స జరిగింది. ఈ శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తి చేసిన వైద్యులను సోమవారం కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన ఈ వివరాలు వెల్లడించారు. నగరంలోని ఏవీఎన్ కళాశాల డౌన్ రోడ్డులో నివాసముంటున్న యశ్వంత్ రెండేళ్లుగా దీర్ఘకాలిక మూత్రపిండాల వ్యాధితో బాధపడుతున్నాడు. దీంతో అతని తల్లి సంతోషి కేజీహెచ్ వైద్యులను ఆశ్రయించారు. అతని ఆరోగ్య పరిస్థితిని పరిశీలించిన వైద్యులు జీవన్‌దాన్ ద్వారా కిడ్నీ మార్పిడికి సిఫార్సు చేశారు. ఈ మేరకు కేజీహెచ్‌లో ఆ బాలుడికి ఈ నెల 7న కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్స నిర్వహించారు. శస్త్రచికిత్స అనంతరం ఆ బాలుడు పూర్తిగా కోలుకోవడంతో సోమవారం ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ చేశారు. ఈ శస్త్రచికిత్సకు ప్రైవేటు ఆసుపత్రుల్లో దాదాపు రూ.15 లక్షల వరకు ఖర్చవుతుందని, కేజీహెచ్‌లో దీన్ని ఉచితంగా నిర్వహించినట్లు డాక్టర్ శివానంద్ తెలిపారు. అలాగే రోగికి రెండేళ్ల కాలానికి రూ.2 లక్షల విలువైన మందులు కూడా ఉచితంగా అందజేస్తామన్నారు. నెఫ్రాలజీ విభాగాధిపతి డాక్టర్ జి.ప్రసాద్, యురాలజీ విభాగాధిపతి డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ రాంబాబు, అనస్థీసియా డాక్టర్లు శ్రీలక్ష్మి, డాక్టర్ ప్రీతి, డాక్టర్ రమేష్, నర్సింగ్ సిబ్బంది సూర్యప్రభ, చంద్రకళ, ఇతర సహాయక సిబ్బంది ఈ శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించడంలో కీలక పాత్ర పోషించినట్లు సూపరింటెండెంట్ వివరించారు.

చిరుధాన్యాలతో రవివర్మకు కళాంజలి



ఏయూక్యాంపస్: నగరానికి చెందిన ప్రముఖ చిత్రకారుడు మోకా విజయ్‌కుమార్ భారతీయ చిత్రకళా దిగ్గజం రాజా రవివర్మ జయంతిని పురస్కరించుకుని అద్భుతమైన కళాఖండాన్ని ఆవిష్కరించారు. విజయ్‌కుమార్ చిరుధాన్యాలను ఉపయోగించి ఆయన చిత్రపటాన్ని రూపొందించారు. ఇందుకోసం దాదాపు వారం రోజుల పాటు శ్రమించారు. సహజత్వం ఉట్టిపడేలా మిల్లెట్స్‌తో చిత్రపటం రూపొందించిన ఆయన.. రాజా రవివర్మకు ఘనమైన నివాళి అర్పించారు.

ట్రాఫిక్ పోలీసులకు కూల్ జాకెట్లు



ట్రాఫిక్ పోలీస్ సిబ్బందికి కూల్ జాకెట్లు అందించిన సీపీ శంఖబ్రత బాగ్చి

విశాఖ సిటీ : ట్రాఫిక్ పోలీస్ సిబ్బందికి వేసవి తాపం నుంచి కొంత ఉపశమనం కలిగేలా కూల్ జాకెట్లు అందిస్తున్నట్లు నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి తెలిపారు. సోమవారం పోలీస్ కమిషనరేట్ సమావేశంలో మందిరంలో ఆయన మాట్లాడుతూ వేసవిలో ఎండ వేడికి గురి కాకుండా సిబ్బందికి తీసుకోవాల్సిన చర్యలపై ఆలోచన చేసినట్లు చెప్పారు. ఇందుకోసం గతేడాది అక్టోబర్‌లో ఢిల్లీలో జరిగిన 'ట్రాఫిక్ ఎక్స్ పో'కు విశాఖ ట్రాఫిక్ విభాగం నుంచి ఒక ఇన్‌స్పెక్టర్, సబ్ ఇన్‌స్పెక్టర్లను పంపించామన్నారు. అక్కడ హర్యానాలోని గురుగ్రామ్‌కు చెందిన 98ఎఫ్ అనే కంపెనీ వారు 'కూల్ జాకెట్లను' ప్రదర్శించినట్లు చెప్పారు. నగరంలో కొందరు దాతల సహాయంతో రూ.5 లక్షలు విలువైన 200 కూల్ జాకెట్లను గురుగ్రామ్ నుంచి తెప్పించినట్లు వెల్లడించారు. ఈ జాకెట్లను సాధారణ ఉష్ణోగ్రత కలిగిన నీటిలో ముంచి తీస్తే వాటి ఉష్ణోగ్రత 8 డిగ్రీలకు పడిపోతుందని వివరించారు. అవి ధరించిన సిబ్బంది ఎండ వేడి నుంచి ఉపశమనం పొంది ట్రాఫిక్ విధులు సమర్థవంతంగా నిర్వర్తించడానికి వీలవుతుందన్నారు. అలాగే వీటిని శీతాకాలంలో సాధారణంగా వాడుకోవచ్చన్నారు. వీటికి రేడియం స్టిక్కరింగ్ ఉండడంతో రాత్రిపూట కూడా ధరించి విధులు నిర్వహించవచ్చని తెలిపారు. అనంతరం ఈ కూల్ జాకెట్లను ట్రాఫిక్ సిబ్బందికి అందజేశారు.

పలు రైళ్లు రద్దు, మరికొన్ని దారి మళ్లింపు

తాటిచెట్లపాలెం: సికింద్రాబాద్ డివిజన్ పరిధి మహబూబాబాద్ స్టేషన్ పరిధిలో జరుగుతున్న 3వ లైన్ నిర్మాణం, పలు ఆధునికీకరణ పనుల నిమిత్తం ఆయా తేదీల్లో పలు రైళ్లు రద్దు చేస్తున్నట్లు, మరికొన్ని దారి మళ్లిస్తున్నట్లు, మరికొన్ని రీ షెడ్యూల్ చేసినట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు.

రద్దయిన రైళ్లు

- విశాఖపట్నం-న్యూఢిల్లీ-విశాఖపట్నం(20805/06) ఏపీ ఎక్స్‌ప్రెస్ మే 27, 28, జూన్ 18, 19వ తేదీల్లోను, విశాఖపట్నం-హజరత్ నిజాముద్దీన్(12803) స్వర్ణ జయంతి ఎక్స్‌ప్రెస్ మే 23, 26, జూన్ 16వ తేదీల్లోను, హజరత్ నిజాముద్దీన్-విశాఖపట్నం(12804) స్వర్ణజయంతి ఎక్స్‌ప్రెస్ మే 25, 28, జూన్ 18వ తేదీల్లో రద్దు చేశారు.

దారి మళ్లించిన రైళ్లు

- మే 22 నుంచి 28వ తేదీ వరకు విశాఖపట్నం-లోకమాన్యతిలక్ టెర్మినస్-విశాఖపట్నం (18519/20) ఎల్టీటీ ఎక్స్‌ప్రెస్‌లు, మే 27, 28వ తేదీల్లో షాలిమర్-హైదరాబాద్(18045)ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్, మే 28, 29వ తేదీల్లో హైదరాబాద్-షాలిమర్(18046)ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్, మే 27, 28వ తేదీల్లో చత్రపతి శివాజి టెర్మినస్ ముంబయి-భువనేశ్వర్-చత్రపతి శివాజి టెర్మినస్ ముంబయి (11019/20) కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లు, మే 28న షాలిమర్-సికింద్రాబాద్(22849) ఎక్స్‌ప్రెస్‌లు వయా విజయవాడ-గుంటూరు-నల్గొండ-పగిడిపల్లి మీదుగా రాకపోకలు సాగిస్తాయి.



- మే 22, జూన్ 19వ తేదీల్లో విశాఖపట్నం-గాంధీదాం (20803) వీక్లీ ఎక్స్‌ప్రెస్, మే 25, జూన్ 22వ తేదీల్లో గాంధీదాం-విశాఖపట్నం(20804) వీక్లీ ఎక్స్‌ప్రెస్, మే 25, జూన్ 15వ తేదీల్లో పూరీ-ఓఖా(20819) ఎక్స్‌ప్రెస్, మే 28, జూన్ 18వ తేదీల్లో ఓఖా-పూరీ(20820) ఎక్స్‌ప్రెస్‌లు వయా లఖోలి-రాయ్‌పూర్-నాగ్‌పూర్-బద్నెరా మీదుగా రాకపోకలు సాగిస్తాయి

మహబూబాబాద్‌లో తాత్కాలికంగా హాల్ట్ తొలగింపు : ఆధునీకీకరణ పనుల నిమిత్తం మహబూబాబాద్ స్టేషన్‌లో కింది రైళ్లకు ఆయా తేదీల్లో తాత్కాలికంగా హాల్ట్‌ను రద్దు చేశారు.

- మే 24 నుంచి 28వ తేదీ వరకు విశాఖపట్నం-హైదరాబాద్ (12727) గోదావరి ఎక్స్‌ప్రెస్, మే 24 నుంచి 28వ తేదీ వరకు విశాఖపట్నం-మహబూబ్‌నగర్(12861) ఎక్స్‌ప్రెస్, మే 24, 25, 26వ తేదీల్లో భువనేశ్వర్-చత్రపతి శివాజి టెర్మినస్ ముంబయి (11020) కోణార్క్ ఎక్స్‌ప్రెస్, మే 24, 25, 26వ తేదీల్లో షాలిమర్-హైదరాబాద్(18045) ఈస్ట్ కోస్ట్ ఎక్స్‌ప్రెస్‌లు ఆయా తేదీల్లో మహబూబాబాద్‌లో ఆగవు.

అదనపు కోచ్‌ల ఏర్పాటు

తాటిచెట్లపాలెం: ప్రయాణికుల సౌకర్యార్థం పలు రైళ్లకు అదనంగా జనరల్, స్లీపర్ క్లాస్ కోచ్‌లను తాత్కాలికంగా జతచేస్తున్నారు. విశాఖపట్నం-బ్రహ్మపూర్-విశాఖపట్నం (18526/18525) ఎక్స్‌ప్రెస్‌కు మే ఒకటో తేదీ నుంచి 31వ తేదీ వరకు రెండు జనరల్ సెకండ్ సిట్టింగ్ కోచ్‌లను, విశాఖపట్నం-రాయ్‌పూర్-విశాఖపట్నం (58528/58527)పాసింజర్‌కు మే ఒకటో తేదీ నుంచి 31వ తేదీ వరకు ఒక జనరల్ సెకండ్ సిట్టింగ్ కోచ్‌ను జతచేస్తున్నారు. అలాగే విశాఖపట్నం-కోరాపుట్-విశాఖపట్నం (58538/58537)పాసింజర్‌కు మే ఒకటో తేదీ నుంచి 31వ తేదీ వరకు ఒక జనరల్ సెకండ్ సిట్టింగ్ కోచ్‌ను, విశాఖపట్నం-బ్రహ్మపూర్-విశాఖపట్నం (58532/58531)పాసింజర్‌కు మే ఒకటో తేదీ నుంచి 31వ తేదీ వరకు ఒక జనరల్ సెకండ్ సిట్టింగ్ కోచ్‌ను జతచేస్తున్నారు. విశాఖపట్నం-భువనేశ్వర్-విశాఖపట్నం (22820/22819) ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌కు మే ఒకటో తేదీ నుంచి 31వ తేదీ వరకు రెండు జనరల్ సెకండ్ సిట్టింగ్ కోచ్‌లను, విశాఖపట్నం-కోరాపుట్-విశాఖపట్నం(18512/18511) ఎక్స్‌ప్రెస్‌కు ఒకటో తేదీ నుంచి 31వ తేదీ వరకు రెండు జనరల్ సెకండ్ క్లాస్ కోచ్‌లను జతచేస్తున్నారు.

ధర్నాలతో దద్దరిల్లిన కలెక్టరేట్

- నిరసనలతో హోరెత్తిన ప్రాంగణం
- తమ సమస్యలు పరిష్కరించాలని నినాదాలు

బీచ్‌రోడ్డు: వివిధ సమస్యలపై బాధితులు, రాజకీయ పక్షాలు చేపట్టిన ఆందోళనలతో సోమవారం కలెక్టరేట్ దద్దరిల్లింది. ఆ పరిసరాలు నిరసనల హోరుతో మార్మోగాయి. సోమవారం నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఆశించిన ఫలితాలను ఇవ్వడం లేదనే ఆవేదనతో వివిధ వర్గాల ప్రజలు కలెక్టరేట్ ఎదుట ధర్నాలకు దిగారు. తమ డిమాండ్లను ప్రభుత్వం, అధికారులు ఆలకించి తక్షణమే పరిష్కరించాలని ఆందోళనకారులు డిమాండ్ చేశారు.

'మోసగాడి అరెస్ట్‌లో పోలీసుల నిర్లక్ష్యం'



పాల అప్పలరాజును అరెస్ట్ చేయాలని ఆందోళన చేస్తున్న బాధితులు

తమ సొమ్మును కాజేసిన మోసగాడిపై చర్యలు తీసుకోవడంలో పోలీసులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపిస్తూ బాధితులు సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టారు. పాల అప్పలరాజు అనే వ్యక్తి ఇళ్లు కట్టించి ఇస్తానని నమ్మించి దాదాపు 20 కుటుంబాల నుంచి కోటిన్నరకు పైగా వసూలు చేసి మోసగించాడని ఆరోపించారు. ఈ విషయంపై ఫిర్యాదు చేసినా మూడో పట్టణ పోలీసులు కేసు నమోదు చేయడంలో మీనమేషాలు లెక్కిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నగర పోలీసు కమిషనర్ బాగ్చి ఆదేశాలు జారీ చేసినా స్థానిక పోలీసులు పట్టించుకోవడం లేదని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పాల అప్పలరాజును తక్షణమే అరెస్ట్ చేసి తమకు న్యాయం చేయాలని నినదించారు.

అందరికీ గ్యాస్ సిలిండర్లు ఇవ్వాలి



అందరికీ మూడు గ్యాస్ సిలిండర్లను ఉచితంగా ఇవ్వాలని సీపీఎం ప్రతినిధుల నిరసన

రాష్ట్ర ప్రభుత్వం ఏడాదికి ఉచితంగా అందిస్తున్న మూడు గ్యాస్ సిలిండర్ల పథకాన్ని రేషన్ కార్డు ఉన్న ప్రతి పేద కుటుంబానికి వర్తింపజేయాలని సీపీఎం ఆధ్వర్యంలో మహిళలు ఆందోళన చేశారు. ప్రభుత్వం విధించిన నిబంధనల వల్ల అనేక మంది పేదలు లబ్ధి పొందలేకపోతున్నారన్నారు. తెలుపు రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందజేయాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు.



వినతిపత్రం అందజేస్తున్న డిజిటల్ అసిస్టెంట్లు

'టెక్నికల్ చానల్ ద్వారానే పదోన్నతులు'

గ్రామ సచివాలయాల్లో డిజిటల్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న తమకు టెక్నికల్ చానల్ ద్వారానే పదోన్నతులు కల్పించాలని పెందుర్తి, ఆనందపురం, భీమునిపట్నం మండలాల పరిధిలోని డిజిటల్ అసిస్టెంట్లు కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్‌ను కోరారు. ఈ మేరకు వారు కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. తమను డిజిటల్ అసిస్టెంట్ల నుంచి గ్రేడ్–5 పంచాయతీ సెక్రటరీగా పదోన్నతులు కల్పించడం సరికాదని వారు పేర్కొన్నారు. తమకు టెక్నికల్ చానల్ ద్వారానే పదోన్నతులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

జీవనోపాధి కోల్పోయాం

ఆనందపురం మండలం తర్లువాడలో 303 ఎకరాల డీ పట్టా భూములను సర్వే నంబర్లు సరి చేస్తామని చెప్పి అధికారులు బలవంతంగా లాక్కున్నారని, ఆ భూములను తిరిగి తమకు ఇవ్వాలని ఆ గ్రామ దళితులు కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ఐటీ కంపెనీల కోసం తమకు తెలియకుండా ఆ భూములను కేటాయించారని, తద్వారా జీవనోపాధి కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ 303 ఎకరాలను తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారు.



ఆందోళన చేస్తున్న తర్లువాడ దళితులు

దివ్యాంగుడి పింఛన్ నిలిపివేత

కలెక్టరేట్ చుట్టూ తల్లీకొడుకుల ప్రదక్షిణలు



తన కుమారుడిని కలెక్టరేట్‌కు తీసుకొస్తున్న అతని తల్లి జయలక్ష్మి

ఈ చిత్రంలో కనిపిస్తున్న దివ్యాంగుడి పేరు ఎ.శ్రీనివాస్. అతనిది మంగాపురం కాలనీ. గతంలో రూ.3 వేల పింఛన్ అందేది. ఇటీవల పింఛన్ నిలిపివేశారు. పింఛన్ పునరుద్ధరించాలని అతని తల్లి జయలక్ష్మి కొడుకును పట్టుకుని కలెక్టరేట్ చుట్టూ ప్రదక్షిణలు చేస్తోంది. అయినప్పటికీ అధికారులు కరుణించడం లేదు. ఎన్నిసార్లు అధికారులకు అర్జీ పెట్టుకున్నా ఫలితం ఉండడం లేదని ఆమె వాపోయింది.

అదే అర్జీ మళ్లీ వస్తే.. అధికారులదే బాధ్యత

కలెక్టర్ హరేంధిర ప్రసాద్ స్పష్టీకరణ

బీచ్‌రోడ్డు: ప్రజల నుంచి అందే ఫిర్యాదులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి, అవి పునరావృతం కాకుండా శాశ్వతమైన, నాణ్యమైన పరిష్కారాలు చూపాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం జరిగిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'(పీజీఆర్ఎస్) కార్యక్రమానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి కలెక్టర్ అర్జీలు స్వీకరించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యల పూర్తి స్థాయి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని వారికి భరోసా ఇచ్చా రు. ఈ సందర్భంగా అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. అర్జీలపై సమగ్ర విచారణ జరిపి, ఫిర్యాదుదారు సంతృప్తి చెందేలా పరిష్కారం చూపాలన్నారు. ఒక అర్జీని పరిష్కరించామని నివేదించే ముందు సంబంధిత అధికారి తప్పనిసరిగా అర్జీదారుడితో మాట్లాడాలని స్పష్టం చేశారు. రెవెన్యూ, జీవీఎంసీ శాఖలకు సంబంధించిన అర్జీలు ఎక్కువగా వస్తున్నందున.. వాటిపై ప్రత్యేక దృష్టి సారించి శాశ్వత పరిష్కార మార్గాలు కనుగొనాలని ఆదేశించారు. అధికారులు తమ శాఖల్లో ప్రతి రోజూ పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కార పురోగతిపై సమీక్ష నిర్వహించాలన్నారు. ఒకే సమస్యపై అర్జీ మళ్లీ వస్తే సంబంధిత జిల్లా అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని కలెక్టర్ హెచ్చరించారు. పరిష్కరించిన అర్జీలపై లబ్ధిదారుల స్పందన సేకరించి, మొబైల్ యాప్‌లో నమోదు చేయాలని, 'ఎన్‌రోల్‌మెంట్ ఆఫ్ ఎంప్లాయీస్ ఇన్ హౌస్‌హోల్డ్ సర్వే'కు సంబంధించిన పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు.



అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

252 అర్జీల స్వీకరణ

సోమవారం జరిగిన ప్రజావేదికకు మొత్తం 252 వినతులు అందాయి. వాటిలో రెవెన్యూ శాఖకు సంబంధించి 122, జీవీఎంసీ 57, పోలీసు శాఖ 11, ఇతర విభాగాలకు చెందిన 62 వినతులు ఉన్నాయి. కలెక్టర్‌తో పాటు డీఆర్వో భవానీశంకర్, భీమిలి ఆర్డీవో సంగీత్ మాథూర్, జీవీఎంసీ సిటీ ప్లానింగ్ అధికారి ధనుంజయరెడ్డి తదితరులు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

మత్స్యకార భృతి రాలేదు



నా భర్త 25 ఏళ్లుగా చేపల వేట చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల అందించిన వేట నిషేధ భృతి నా భర్తకు రాలేదు. గతంలో ఎప్పుడూ ఇలా జరగలేదు. ఏటా చేపల వేట నిషేధ కాలంలో ప్రభుత్వ సాయం అందేది. ఈ ఏడాది మాత్రం ఇప్పటి వరకు రాలేదు. దీనిపై విచారించి, భృతి అందేలా చూడాలి.

– కె.కొర్లమ్మ, ఏగువ పేట, భీమిలి

సర్టిఫికెట్ ఇప్పించండి



నాకు 2023లో వెన్నుపూస ఆపరేషన్ జరిగింది. అయినా ఇంకా నడవలేకపోతున్నాను. మూత్ర విసర్జన, మల విసర్జన కూడా సరిగ్గా అవ్వడం లేదు. దీంతో కేజీహెచ్ వైద్యులను సంప్రదించగా.. శస్త్రచికిత్స ఆలస్యం కావడమే ఇందుకు కారణమని చెప్పారు. అయితే ఆ విషయాన్ని సర్టిపై చేసి ఓ లేఖపై రాసి ఇవ్వాలని కోరినా ఇవ్వడం లేదు. శస్త్రచికిత్స జరిగినట్లు సర్టిఫికెట్ ఇప్పించగలరు.

– కె.రమణ, వేములవలస, ఆనందపురం

పట్టని ప్రజల గోడు.. అధికారుల తీరు చూడు

సెల్‌ఫోన్లలో రీల్స్, సినిమాలు చూస్తూ కాలక్షేపం



మొబైల్‌లో ఇంగ్లిష్ సినిమా చూస్తున్న అధికారి



వీడియోలు చూసుకుంటున్న అధికారులు

బీచ్‌రోడ్డు: క్షేత్ర స్థాయిలో తమ సమస్యలు పరిష్కారం కాకపోవడంతో, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తే న్యాయం జరుగుతుందనే ఆశతో సోమవారం కలెక్టరేట్‌కు చేరుకున్న ప్రజలకు అక్కడ ఎదురైన దృశ్యాలు నిరాశకు గురిచేశాయి. 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో కొందరు ఉన్నతాధికారులు వ్యవహరించిన తీరుపై విమర్శలు వెల్లువెత్తాయి. కలెక్టర్ స్వయంగా కార్యక్రమంలో పాల్గొని ప్రజల సమస్యలు వింటుండగా.. హాలులో కూర్చున్న కొందరు ఉన్నతాధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లుగా వ్యవహరించారు. సెల్‌ఫోన్లలో షార్ట్స్, రీల్స్, చివరకు సినిమాలు చూస్తూ కాలక్షేపం చేశారు. తమ గోడు చెప్పుకోవడానికి ఎంతో ఆశతో వచ్చిన ప్రజలు.. అధికారుల తీరును చూసి నివ్వెరపోయారు. ప్రజా సమస్యలను ఆలకించి, వాటి పరిష్కారానికి మార్గాలు సూచించాల్సిన ఉన్నతాధికారులు.. ప్రజల సమక్షంలోనే సెల్‌ఫోన్లకు అతుక్కుపోవడం వారి బాధ్యతారాహిత్యానికి అద్దం పట్టింది.

ఆర్థిక ఇబ్బందులతో విశాఖ రియల్టర్ ఆత్మహత్య

- మామిడిపల్లి రిసార్ట్‌లో ఘటన
- సూసైడ్ నోట్ స్వాధీనం చేసుకున్న పోలీసులు

దేవరాపల్లి: విశాఖపట్నానికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి నడింపల్లి సత్యనారాయణరాజు(70) దేవరాపల్లి మండలం మామిడిపల్లిలోని రిసార్ట్‌లోని ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆర్థిక ఇబ్బందుల వల్లే ఆత్మహత్యకు పాల్పడినట్లు ఆయన రాసిన సూసైడ్ నోట్‌ను సోమవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మృతుడు భార్య విజయలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఇన్‌చార్జి ఎస్‌ఐ ఆర్.ధనుంజయ్ తెలిపారు. ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. విశాఖకు చెందిన సత్యనారాయణరాజు 40 ఏళ్లుగా రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. వ్యాపారంలో భాగంగా కొంత మంది నుంచి తనకు రావలసిన బకాయిలు రూ.కోట్లలో ఉండిపోయాయి. దీంతో ఆయన తీవ్రంగా నష్టపోయారు. దేవరాపల్లి మండలం మామిడిపల్లి రిసార్ట్‌కు సత్యనారాయణరాజు అప్పుడప్పుడు వచ్చి ఒక్కరోజు ఉండి వెళ్లిపోయేవారు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం 10.30 గంటలకు రిసార్ట్‌కు వచ్చిన ఆయన రాత్రి ఇక్కడే ఉన్నారు. సోమవారం ఉదయం రిసార్టు మేనేజర్ రాయిశివ చూసేసరికి గది బయట ఉన్న ఊయల కొక్కానికి సత్యనారాయణరాజు ఉరి వేసుకుని వేలాడుతూ కనిపించారు. వెంటనే ఆయన ఈ విషయాన్ని దేవరాపల్లి పోలీసులతో పాటు మృతుని బంధువులకు సమాచారం అందించాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు.



మామిడిపల్లి రిసార్ట్‌లో ఉరివేసుకున్న రియల్టర్ సత్యనారాయణరాజు

చనిపోయే ముందు తనకు రావలసిన బకాయిల గురించి, ఆరుగురికి విడివిడిగా రాసిన ఉత్తరాలను పోలీసులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. సత్యనారాయణరాజు రిసార్ట్‌కు వచ్చినప్పుడల్లా తీవ్రంగా మదనపడుతూ ఏడ్చేవారని రిసార్టులో పని చేస్తున్న సిబ్బంది పోలీసులకు తెలిపారు. మృతుడు భార్య, కుమారుడు సాయి చైతన్యవర్మ అందించిన సమాచారం మేరకు లోతుగా దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌చార్జి ఎస్‌ఐ ధనుంజయ్ తెలిపారు.

అధికారులు వార్డుల్లో పర్యటించాలి

మేయర్ పీలా శ్రీనివాస్ ఆదేశం



మాట్లాడుతున్న మేయర్ పీలా శ్రీనివాస్

దాబాగార్డెన్స్: నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టిన మేయర్ పీలా శ్రీనివాస్ సోమవారం జీవీఎంసీ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. పారిశుధ్యం, ప్రజారోగ్యం, వీధిలైట్లు, తాగునీరు వంటి వాటిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులను ఆదేశించారు. అధికారులు నిత్యం వార్డుల్లో పర్యటించి, పారిశుధ్య మెరుగుకు కృషి చేయాలన్నారు. వేసవి దృష్ట్యా తాగునీరు పూర్తి స్థాయిలో అందించాలన్నారు. జీవీఎంసీలో అనవసరపు ఖర్చులు తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అధికారులు గీతలు, హద్దులు దాటి విధులు నిర్వహించరాదన్నారు. జీవీఎంసీ డాష్ బోర్డ్, సిటీ ఆపరేషన్ సెంటర్ సమాచారం నివేదిక అందజేయాలని అధికారులను ఆదేశించారు. తాను ప్రతి రోజూ వార్డుల్లో పర్యటిస్తానని తెలిపారు. ఇంతవరకు టెండర్లు తీసుకొని పనులు చేపట్టలేని వారిపై దృష్టి సారించి సకాలంలో పనులు జరిగేలా చర్యలు చేపట్టాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా తాగునీటి విభాగానికి రూ.8 కోట్లు మంజూరయ్యాయని జీవీఎంసీ ప్రధాన ఇంజనీర్ పి.శివప్రసాదరాజు మేయర్‌కు వివరించారు. చలివేంద్రాలు పటిష్టంగా, పరిశుభ్రతతో నిర్విహించాలని ప్రధాన ఇంజనీర్‌కు మేయర్ ఆదేశించారు. సమావేశంలో అదనపు కమిషనర్లు డీవీ రమణమూర్తి, ఎస్ఎస్ వర్మ, చీఫ్ సిటీ ప్లానర్ ప్రభాకరరావు, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వాసుదేవరెడ్డి, డీసీఆర్ శ్రీనివాసరావు, యూసీడీ పీడీ పీఎం సత్యవేణి పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఒకరు నగర బహిష్కరణ

అల్లిపురం: నగరంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తూ.. శస్త్ర చికిత్సల్లో నొప్పి నివారణకు వాడే పెంటాజోసిన్ లాక్టేట్ ఇంజక్షన్లను అక్రమంగా విక్రయించిన పితాని అప్పలరాజు అలియాస్ చిన్నాపై నగర బహిష్కరణ వేటు పడింది. టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నేరెళ్లకోనేరు, చెరువుగట్టు ప్రాంతానికి చెందిన అతన్ని నగరం నుంచి బహిష్కరిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ముఖేష్‌కుమార్ మీనా సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. 2022 మే 7వ తేదీన అతని వద్ద నుంచి భారీ మొత్తంలో పెంటాజోసిన్ ఇంజక్షన్లను సిటీ టాస్క్ ఫోర్సు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మరో కేసులో 21 కేజీల గంజాయిని కూడా స్వాధీనం చేసుకున్నారు. అలాగే అతనిపై టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో రెండు కేసులు, ఎంవీపీ పోలీస్ స్టేషన్‌లో ఒక కేసు నమోదయ్యాయి. నమోదైన కేసుల్లో రెండు దర్యాప్తు దశలో ఉండగా.. మూడింటిలో అప్పలరాజు ఇప్పటికే శిక్ష అనుభవిస్తున్నాడు. ఈ నేపథ్యంలో నిందితుడిని నగరం నుంచి బహిష్కరిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్‌కు అదనపు బాధ్యతలు

ఉక్కునగరం: విశాఖ స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (కమర్షియల్) జి.వి.ఎస్.ప్రసాద్‌కు డైరెక్టర్ (ఫైనాన్స్)గా అదనపు బాధ్యతలు అప్పగించారు. సోమవారం కేంద్ర ఉక్కు మంత్రిత్వశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం డైరెక్టర్ (ఫైనాన్స్)గా ఉన్న గణేష్ ఈ నెలాఖరున పదవీ విరమణ చేయనున్నారు. ఆ పోస్టుకు ఇంటర్వ్యూ నిర్వహించినప్పటికి ఎవరినీ సెలెక్ట్ చేయలేదు. ఈ క్రమంలో జి.వి.ఎస్.ప్రసాద్‌కు ఈ బాధ్యతలు అప్పగించారు. మే ఒకటి నుంచి జూలై 31 వరకు లేదా తదుపరి ఉత్తర్వుల వరకు ఆయన ఈ బాధ్యతలు నిర్వహించనున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే సమ్మెకు వెళతాం

గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ హెచ్చరిక

దాబాగార్డెన్స్: ఆప్కాస్ పరిధిలో లేని కార్మికులందరికీ ఎస్ఎల్ఎఫ్ ద్వారా వేతనాలు చెల్లించాలని, లేని పక్షంలో నిరవధిక సమ్మెకు వెళ్తామని గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ హెచ్చరించింది. ఈ మేరకు సోమవారం కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్‌కు యూనియన్ గౌరవ అధ్యక్షుడు పి వెంకట్‌రెడ్డి, అధ్యక్షుడు టి నూకరాజు, ప్రధాన కార్యదర్శి ఉరుకూటి రాజు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఓ ప్రకటన విడుదల చేశారు. నిరవధిక సమ్మెలోకి వెళ్లే ముందు మే 5న మొత్తం ట్రాన్స్‌పోర్ట్ విధులను నిలుపుదల చేయాలని కార్మికులు నిర్ణయించుకున్నట్లు పేర్కొన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని గతంలో అనేకసార్లు కమిషనర్‌కు వినతిపత్రాలు ఇచ్చినా ప్రయోజనం లేకపోయిందన్నారు. లోహియా కాంట్రాక్టర్ కార్మికుల నుంచి ప్రతి నెలా రూ. 3 వేలు అక్రమంగా వసూలు చేస్తున్నారని, ఈ సమస్యా పరిష్కారం కాలేదన్నారు. క్లాప్ డ్రైవర్లకు నాలుగేళ్ల పీఎఫ్ బకాయి రూ.7 కోట్లు పెండింగ్‌లో ఉందని, వాటిని ఇంకా జమ చేయలేదన్నారు. చెత్త తరలింపు లోడర్లకు జీవో వేతనాలు, బకాయి వేతనాలు చెల్లించలేదన్నారు. పారిశుధ్య కాంట్రాక్టు, బదిలీ కార్మికులకు జీవో ప్రకారం వేతనాలు, పీఎఫ్, ఈఎస్ఐ చెల్లించలేదని పేర్కొన్నారు. 6 నెలలుగా పనిముట్లు సరఫరా చేయడం లేదని, సబ్బులు, నూనెలు తదితరాలు అందజేయడం లేదన్నారు. వర్కర్–కమ్–డ్రైవర్ల ఫైళ్లు క్లియర్ చేయడం లేదని, 60 ఏళ్లు నిండని వారిని రిటైర్ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంటింటి నుంచి చెత్త సేకరణ, రవాణా చేసే కార్మికులపై పని భారం పెంచుతున్నారని ఆరోపించారు. పారిశుధ్య కార్మికుల సంక్షేమాన్ని పట్టించుకోవాలని, సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

జ్యూస్‌షాపులకు చేపల నిల్వకు వాడే ఐస్

- విజిలెన్స్ దాడుల్లో వెలుగు చూసిన వైనం
- మూడు ఐస్ ఫ్యాక్టరీలకు రూ.30వేల చొప్పున జరిమానా



ఫ్యాక్టరీలో ఐస్ తయారీని పరిశీలిస్తున్న అధికారుల బృందం

ఎంవీపీకాలనీ: విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సోమవారం జరిపిన దాడుల్లో విస్తుపోయే వాస్తవాలు వెలుగు చూశాయి. జెట్టీల్లో చేపల నిల్వకు వాడే ఐస్ ముక్కలను కొన్ని ఫ్యాక్టరీలు నగరంలోని ఫ్రూట్ జ్యూస్ దుకాణాలకు సరఫరా చేస్తుండటం వారిని అవాక్కయ్యేలా చేసింది. కొంతకాలంగా ఈ తరహా వ్యాపారం యథేచ్ఛగా జరుగుతున్నట్లు అధికారులు గుర్తించారు. రీజినల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ జిల్లా అధికారి కింజరాపు ప్రభాకర్‌కు వచ్చిన విశ్వసనీయ సమాచారంతో సోమవారం సంస్థ డీఎస్పీ మురళీకృష్ణ, సీఐ సంతోష్‌కుమార్, జిల్లా లీగల్ మెట్రాలజీ, శానిటేషన్, ఫుడ్ సేఫ్టీ సిబ్బందితో కూడిన బృందం గాజువాక, మధురవాడ, పెదగంట్యాడ ప్రాంతాల్లోని ఐస్ తయారీ ఫ్యాక్టరీల్లో దాడులు చేసింది. ఆయా ఫ్యాక్టరీల్లో కలుషిత నీటితో తయారు చేస్తున్న ఐస్‌ను జ్యూస్ షాపులకు సరఫరా చేస్తున్నట్లు గుర్తించింది. ఆహార భద్రత నియమాల ప్రకారం ఆ ఐస్‌కు నాణ్యత లేకపోవడంతో.. దాన్ని ఆహార పదార్థాల్లో ఉపయోగించకూడదని తేల్చింది. ఆయా ఫ్యాక్టరీల్లో ఐస్ ముక్కలను అధికారులను స్వాధీనం చేసుకుని.. కొన్ని శాంపిల్స్ ల్యాబ్ పరీక్షలకు పంపించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న ఆయా ఫ్యాక్టరీలపై ఫుడ్ సేఫ్టీ అధికారులు రూ.30 వేల చొప్పున ఫైన్ విధించారు. ల్యాబ్‌లో పరీక్షించిన అనంతరం, ఆ రిపోర్ట్ ఆధారంగా ఆయా ఫ్యాక్టరీలపై అవసరమైన చర్యలు తీసుకుంటామని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తెలిపారు.

పాలిసెట్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

మురళీనగర్: ఈనెల 30న నిర్వహించనున్న పాలిసెట్‌ను పకడ్బందీగా నిర్వహించాలని కాకినాడ రీజనల్ జాయింట్ డైరెక్టర్ జె.సత్యనారాయణ మూర్తి సూచించారు. సోమవారం కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో విశాఖ జిల్లాలో పాలిసెట్ నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపై ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. పాలిసెట్ నిర్వహణకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. కేంద్రాల్లో విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కోఆర్డినేటింగ్ సెంటర్ పరిధిలోని పరీక్ష కేంద్రాలు, ఏర్పాట్లకు సంబంధించిన వివరాలను జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ కె.నారాయణ రావు వివరించారు. సహాయ సమన్వయాధికారి కేడీవీ నరసింహారావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

వీఎంఆర్‌డీఏ మహిళా ఉద్యోగుల కోసం కమిటీ

విశాఖ సిటీ: వీఎంఆర్‌డీఏ మహిళా ఉద్యోగులపై లైంగిక వేధింపుల సమస్యల నివారణ కమిటీని మెట్రోపాలిటన్ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ పునరుద్ధరించారు. సంస్థలో గతంలో ఉన్న కమిటీ సభ్యులు పదవీ విరమణ, బదిలీ అయిన కారణంగా గత కొంత కాలంలో ఈ కమిటీ ఖాళీగా ఉంది. దీంతో కమిషనర్ కొత్త వారితో కమిటీని ఏర్పాటు చేశారు. ఇందులో చైర్మన్‌గా చీఫ్ అర్బన్ ప్లానర్ శిల్ప, కన్వీనర్‌గా పరిపాలనాధికారిని కార్తీక, సభ్యులుగా దేవి, శిరీష వ్యవహరించనున్నారు. సంస్థలో మహిళా ఉద్యోగులపై లైంగిక సమస్యలు ఉంటే ఈ కమిటీ విచారించి సంబంధిత నివేదికను కార్యదర్శి ద్వారా కమిషనర్‌కు సమర్పించనున్నారు. ఆ నివేదిక ప్రకారం మహిళా ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేసిన వారిపై చర్యలు తీసుకుంటామని కమిషనర్ విశ్వనాథన్ ఒక ప్రకటనలో తెలిపారు.


మ్యూల్ ఖాతాల సరఫరాదారు అరెస్ట్

బీచ్‌రోడ్డు: క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న వారికి సహకరిస్తున్న ఒక వ్యక్తిని సోమవారం సైబర్ క్రైం పోలీసులు అరెస్ట్ చేశారు. కొంకోటకు చెందిన నిందితుడు.. క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న వారికి మ్యూల్ బ్యాంకు ఖాతాలు సరఫరా చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. అతనిపై ప్రత్యేక నిఘా పెట్టి.. సాంకేతిక పరిజ్ఞానంతో చాకచక్యంగా పట్టుకున్నారు. సోమవారం అతన్ని రిమాండ్‌కు తరలించారు.

37.5 కిలోల గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం: గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరిని సోమవారం రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 37.5 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ప్రభుత్వ రైల్వే పోలీసులు తెలిపిన వివరాలివి.. జీఆర్పీ, ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్లు సీహెచ్ ధనుంజయనాయుడు, దినేష్ కుమార్ దాస్ తమ సిబ్బందితో కలిసి సోమవారం విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో తనిఖీలు చేపట్టారు. తమిళనాడు రాష్ట్రం కాంచీపురం జిల్లాకు చెందిన పి.బాబు, స్నేగా హేచ్ వద్ద గంజాయి ఉన్నట్లు గుర్తించారు. వారు విశాఖపట్నం మీదుగా తమిళనాడుకు గంజాయిని రవాణా చేస్తుండగా పట్టుబడ్డారు. వారి నుంచి రూ.1,87,500 విలువ గల 37.5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచారు.

జాబితాలో ప్రజాకవుల పేర్లు లేకపోవడం దారుణం



మీడియాతో మాట్లాడుతున్న తెలకపల్లి రవి

దాబాగార్డెన్స్: తెలుగునాట మహనీయుల జయంతులు, వర్ధంతులు నిర్వహించేందుకు ప్రభుత్వం విడుదల చేసిన అధికారిక జాబితాలో గురజాడ అప్పారావు, కందుకూరి వీరేశలింగం పంతులు, గుర్రం జాషువా వంటి ప్రముఖుల పేర్లు లేకపోవడంపై సాహితీ స్రవంతి రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు, రాజకీయ విశ్లేషకుడు తెలకపల్లి రవి ఆవేదన వ్యక్తం చేశారు. డాబాగార్డెన్స్‌లోని అల్లూరి విజ్ఞానకేంద్రంలో సోమవారం నిర్వహించిన ఉత్తరాంధ్ర సాహిత్యవేత్తలు, రచయితల ఇష్టాగోష్టి కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మీడియాతో మాట్లాడారు. ఇది యాదృచ్ఛికంగా జరిగిందా? లేదా కావాలనే చేశారా? అన్నది బేరీజు వేసుకోవాలన్నారు. నిజంగా కావాలని చేసి ఉంటే విచారకరమన్నారు. మతపరమైన కోణంతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, వాస్తవిక చరిత్రను కప్పి పుచ్చే ప్రయత్నం చేస్తోందని, అందుకు నిదర్శనమే ఈ అధికారిక జాబితా అని పేర్కొన్నారు. ఇప్పటికే రాష్ట్రంలోని, కేంద్రంలోని ప్రధాన మీడియా ఛానల్స్, పత్రికలను బీజేపీ ప్రభుత్వం నియంత్రిస్తూ వాస్తవాలు ప్రజలకు తెలియజేయకుండా చేస్తోందని మండిపడ్డారు. దీనిపై ప్రభుత్వం పునఃపరిశీలన చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ, సాహితీ స్రవంతి సభ్యులు చలపతి, రామారావు పాల్గొన్నారు.

డీఎస్సీ నోటిఫికేషన్ రద్దు చేయాలి

సాక్షి,పాడేరు: ప్రభుత్వం మెగా డీఎస్సీని ప్రకటించి, ఆదివాసీలకు అన్యాయం చేస్తోందని, జిల్లాలో డీఎస్సీని రద్దు చేయాలని కలెక్టర్ దినేష్‌కుమార్‌కు ఆదివాసీ డీఎస్సీ సాధన కమిటీ ప్రతినిధులు కోరారు. సోమవారం రాత్రి వారు కలెక్టర్‌ను కలిశారు. 5వ షెడ్యూల్ ఏరియాలో గిరిజనులకు 100 శాతం రిజర్వేషన్ అమలుపై స్పష్టత ఇవ్వలేదని, దీని వల్ల గిరిజన యువతకు తీవ్రఅన్యాయం జరుగుతుందని వారు కలెక్టర్‌కు వివరించారు. జీవో నంబర్ 3 పునరుద్ధరణ, ప్రత్యామ్నాయ జీవో జారీ, ఆదివాసీలకు ప్రత్యేక డీఎస్సీ డిమాండ్ల సాధనకు ఉద్యమం చేస్తున్నామని కలెక్టర్‌కు వివరించారు. ఈ మేరకు మే 2వతేదీ నుంచి రాష్ట్రంలోని అన్ని గిరిజన ప్రాంతాల్లో నిరవధిక బంద్ చేపడుతున్నామని, సహకరించాలని కలెక్టర్‌ను కోరారు.